క్లుప్తంగా

అమ్మవారి సేవలో మంత్రి వేణుగోపాల కృష్ణ



తిరుచానూరు: పద్మావతి అమ్మవారిని ఆదివారం రాత్రి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద ఆశీర్వాద మండపంలో పండితులు వేద ఆశీర్వాదం అందించగా అధికారులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి, మధు, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, ఏవీఎస్‌ఓ శైలేంద్రబాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దామోదర్, అశోక్ పాల్గొన్నారు.

పలువురికి డాక్టరేట్లు



ఎస్.సుధాలక్ష్మి

తిరుచానూరు: పద్మావతి మహిళా వర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగంలో పరిశోధన చేసిన ఎస్.సుధాలక్ష్మికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆమె ప్రొఫెసర్ ఎం.ఉషారాణి పర్యవేక్షణలో ఏ నావెల్ అండ్ ఎఫీషియెంట్ హైబ్రిడ్ అప్రోచెస్ ఫర్ మల్టీ డాక్యుమెంట్ టెక్స్‌ట్ సమ్మరైజేషన్ యూజింగ్ డీప్ లెర్నింగ్ మోడల్స్ అనే అంశంపై పరిశోధన చేశారు.



శ్రీనివాసులు

అలాగే ఎస్వీయూ స్టాటస్టిక్స్ విభాగం పరిశోధక విద్యార్థి ఆకాశం శ్రీనివాసులుకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన ఆచార్య భూపతి నాయుడు పర్యవేక్షణలో ఫోర్‌కాస్టింగ్ కోసం స్టాకాస్టిక్ మోడల్స్ అనే అంశంపై పరిశోధన చేశారు.



కిరణ్ శంకర్ భట్

రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం సాహిత్య విభాగం పరిశోధక విద్యార్థి కిరణ్‌శంకర్ భట్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన సాహిత్య విభాగం ఆచార్యుడు చక్రవర్తి రంగనాథ్ పర్యవేక్షణలో ఆచార్య హెచ్‌వీ. నాగరాజ రచించిన శతక కావ్యాల సాహిత్యక దృష్టిలో విమర్శనాత్మక అధ్యయనం అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు.

పేదలకు అన్నదానం



పేదలకు అన్నదానం చేస్తున్న అక్కినేని అభిమాన సంఘ నేతలు, రంగస్థలి చైర్మన్

తిరుపతి కల్చరల్: సినీ హీరో అక్కినేని నాగేశ్వరరావు 9వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం అక్కినేని నాగేశ్వరరావు అభిమాన సంఘం ఆధ్వర్యంలో కోనేటి కట్ట వద్ద పేదలకు అన్నదానం చేశారు. అంతకు ముందు అక్కినేని నాగేశ్వరరావు చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. అన్నదాన కార్యక్రమాన్ని రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ప్రారంభించారు. గోపీనాథ్, బాలరాజు, ఆర్కాట్ కృష్ణప్రసాద్, రమణ, భాస్కర్, యతిరాజులు, ద్వారక తిరుమలయ్య, చంద్రశేఖర్, కుమార్, పార్థసారథి, భార్గవ్, సుబ్రమణ్యంరెడ్డి, రామూర్తి రెడ్డి పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కళాకారుల నృత్య ప్రదర్శన

తిరుచానూరు: శిల్పారామంలోని కళా వేదికపై ఆదివారం సాయంత్రం కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. నెల్లూరు నృత్యానికేతన్ కళాకారులు ప్రణవి, సాన్వీ, హర్షిత, వినూత్న, మమత, దేవినాగశ్రీ, లావణ్య, శాంబవి, నిత్య, జయసుకృతి ప్రదర్శించిన శ్రీబాలాత్రిపుర సుందరి కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. వారిని శిల్పారామం అధికారి ఖాదర్‌వలి జ్ఞాపికలతో సత్కరించారు.

ప్రతి గడపకూ జగనన్న సంక్షేమం

- విద్యుత్ మీటర్ల సమస్య పరిష్కరించండి
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



జగనన్న అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి మంగళం: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందజేయడంతోపాటు మూడేళ్లల్లో తాము చేసిన ప్రగతిని తెలియజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్ రాజమ్మ, వెంకటమునిరెడ్డితో కలిసి 20వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు పొందిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగనన్న ఇల్లు వచ్చిందా, కాపు నేస్తం అందిందా, వైఎస్సార్ చేయూత పొందారా, సున్నా వడ్డీ రుణాలు తీసుకున్నారా అని తెలుసుకున్నారు. అన్ని పథకాలు అందాయని, జగనన్నకు ఓటుతో రుణం తీర్చుకుంటామని మహిళలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపాలన్న ఉద్దేశంతో దేశ రాజకీయ చరిత్రలోనే ఏ నాయకుడు అందించలేనన్ని సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగనన్నకు దక్కిందన్నారు. ఆయనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

విద్యుత్ మీటర్ల సమస్యను పరిష్కరించండి

విద్యుత్ మీటర్లు లేకపోయినా తమ పేరుతో ఉన్నాయని అధికారులు చూపిస్తున్నారని, దాంతో ప్రభుత్వ పథకాలు అందకుండా పోతాయోనన్న భయంతో రేఖ, వరలక్ష్మి అనే మహిళలు ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన వెంటనే విద్యుత్‌శాఖ అధికారులను పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, వెంకటమునిరెడ్డి, టౌన్ బ్యాంకు డైరెక్టర్లు మబ్బు నాదమునిరెడ్డి, మారేల బ్రహ్మానందరెడ్డి, మాకం చంద్రయ్య, తిమ్మారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, సోము, డిష్ చంద్ర, కుమార్, మల్లం రవికుమార్‌రెడ్డి, నాదముని, కంకనాల రమేష్, ఉప్పరపాలెం మధు పాల్గొన్నారు.

జోరుగా పరుష పందేలు



పరుగులు తీస్తున్న కోడెగిత్తలు

చంద్రగిరి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని చిన్న రామాపురంలో ఆదివారం పశువుల పండుగను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పశువులను అందంగా అలంకరించారు. నడుముకు నల్లదారం, కొమ్ములకు వివిధ దేవతామూర్తుల చిత్రాలు, నాయకుల చిత్ర పటాలు తదితర పలకలను కట్టి ముస్తాబు చేశారు. జన సంద్రం నడుమ దూసుకువస్తున్న కోడె గిత్తలను అదుపు చేసేందుకు యువకులు పోటీ పడ్డారు. సొంతం చేసుకున్న పలకలను చేత పట్టుకుని విజయ గర్వంతో చిందులు వేశారు. పశువులను అదుపు చేసేందుకు పోటీ పడిన సమయంలో పలువురు యువకులు స్వల్పంగా గాయపడ్డారు. వారికి స్థానిక వైద్యులు ప్రథమ చికిత్స చేసి తిరుపతి రుయాకు తరలించారు. పశువుల పండుగను తిలకించేందుకు వచ్చిన ప్రజలకు గ్రామస్తులు, సర్పంచ్ రాగిణి, సాగర్ దంపతులు అన్నదానం చేశారు.



కోడెగిత్తను నిలువరించేందుకు పోటీ పడుతున్న యువకులు

చిన్నారి వైద్యానికి రూ.1.50 లక్షల సాయం



నగదు అందజేస్తున్న అసోసియేషన్ నేతలు

తిరుపతి కల్చరల్: బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ చెన్నై అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మెకానిక్ సునీల్ కుమారుడి(3)కి వైద్యం కోసం తిరుపతి టూ వీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రూ.1.50 లక్షలు సాయం చేశారు. మెకానిక్ కుమారుడి వైద్యం కోసం ఇంటిని సైతం తాకట్టుపెట్టి రూ.20 లక్షలు ఖర్చు చేశారు. అవస్థలు పడుతున్న మెకానిక్ సునీల్‌కు అసోసియేషన్ చేయూత ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. టూవీలర్స్ రాష్ట్ర అసోసియేషన్ రూ.20 వేలు, నవ్యాంధ్ర అసోసియేషన్ రూ.10 వేలు ఇవ్వగా మెకానిక్‌లు తమ కష్టార్జితాన్ని కలిపి రూ.1.50 లక్షలు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి, మల్లీశ్వర్, నరేంద్ర, సురేష్, మణికంఠ, జలంధర్, మొబ్బుల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో ట్రాఫిక్ కష్టాలు

తిరుపతి అర్బన్: తిరుపతి ఆర్టీసీ బస్టాండ్‌లో ట్రాఫిక్ సమస్య కొనసాగుతూనే ఉంది. కొందరు డ్రైవర్లు బస్సులను అడ్డదిడ్డంగా ఉంచుతుండడంతో బస్టాండ్ నుంచి బస్సును బయటకు తీయాలంటే ముప్పులు తిప్పలు తప్పడం లేదు. రాత్రి సమయంలో 30 నుంచి 40 నిమిషాలు పడుతోంది. ఈ క్రమంలో డ్రైవర్ల మధ్య వాగ్వాదాలు నెలకొంటున్నాయి. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతోనే ఈ సమస్య తీవ్ర మవుతోందనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

చంద్రగిరి: స్థానిక కొత్తపేటలో ఈ నెల 14న ఆత్మహత్యకు యత్నించిన మహిళ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ హిమబిందు తెలిపారు. తిరుపతికి చెందిన అరుణ్‌కుమార్ హెరిటేజ్ ఫ్యాక్టరీలో పనిచేస్తూ తన భార్య శిరీష(27)తో కలిసి చంద్రగిరి కొత్తపేటలోని గాండ్లవీధిలో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో కుటుంబ కలహాలతో ఈనెల 14న శిరీష పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను తిరుపతి రుయాకు తరలించారు. ఆదివారం రాత్రి పరిస్థితి విషమించి ఆమె మృతిచెందిందని ఎస్‌ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులు వేగవంతం చేయాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా: మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులను వేగవంతం చేయాలని డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన ఆదివారం అక్కారంపల్లి, కొర్లగుంట, కొంకా చెన్నాయగుంట, గొల్లవానిగుంట, చింతలచేను రోడ్ల పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలోని నాయకులు, అధికారులు దూరదృష్టితో ఆలోచించకపోవడంతోనే తిరుపతి నగరం అభివృద్ధికి నోచుకోలేదని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని చోట్లా అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. కౌన్సిల్ అనుమతితో రూ.35 కోట్లతో 14 మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులను ప్రారంభించినట్టు వివరించారు. ఈ రోడ్లు పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు చాలా వరకు తగ్గుతాయని చెప్పారు. నగర అభివృద్ధిలో భాగంగా తిరుపతి తూర్పు వైపున 12 మాస్టర్ ప్లాన్ రోడ్లను అందుబాటులోకి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే గెస్ట్‌లైన్ పక్క నుంచి రేణిగుంట రోడ్‌లోని హీరో హోండా షోరూం వరకు వేసిన అన్నమయ్య మార్గ్, అలాగే డీబీఆర్ ఆస్పత్రి నుంచి వేసిన వైఎస్ఆర్ మార్గ్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావడంతో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు నుంచి కొంత ఉపశమనం లభించిందన్నారు.

జిల్లా సచివాలయ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన జిల్లా కార్యవర్గ సభ్యులు

తిరుపతి తుడా: ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం (384/2022) తిరుపతి జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. న్యూ బాలాజీ కాలనీలోని ఎంఎంబీజీ ఆడిటోరియంలో ఆదివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సలహా కమిటీ చైర్మన్ చొప్ప రవీంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ సంఘం కృషి చేస్తోందన్నారు. ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ఐకమత్యంగా ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు.

ఏపీ జీఈఏ తిరుపతి జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు సంక్షేమ పథకాలు చేరవేయడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అనంతరం ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తిరుపతి జిల్లా కమిటీని ప్రకటించారు. తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా మేరుగ రమేష్, సహాధ్యక్షుడిగా శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా భరద్వాజ్, కోశాధికారిగా సుబ్బరాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా దేవిప్రియ, జయచంద్ర, ఉపాధ్యక్షులుగా వినోద్, గీత, మురళి, ఢిల్లీ, గోపి, కార్యనిర్వహక కార్యదర్శిగా యశ్వంత్, సంయుక్త కార్యదర్శిగా విజయ్, కుమార్, సుధాకర్, రాకేష్, కార్యనిర్వాహక సభ్యులుగా సురేష్, శివయ్య, రత్నమాలిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, ఏపీ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇందురిపల్లి మణి, మహాలక్ష్మి, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు బషీర్ అహ్మద్, వీఆర్వోల సంఘం జిల్లా నాయకులు బాలాజీ, నాగరాజు, ఏపీ ఎంపీహెచ్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

కోచ్‌ను నియమించాలని వినతి



మంత్రి ఆర్‌కే.రోజాకు వినతి పత్రం సమర్పిస్తున్న జిమ్నాస్టిక్ అసోసియేషన్ నేతలు

తిరుపతి కల్చరల్: జిమ్నాస్టిక్స్ ఎన్ఐఎస్ కోచ్‌ను నియమించడంతో పాటు ప్రాథమిక సదుపాయాలు కల్పించాలని తిరుపతి జిల్లా జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ నేతలు కోరారు. వారు ఆదివారం శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మంత్రి ఆర్‌కే. రోజాకు వినతి పత్రం సమర్పించారు. అంతకు ముందు శివజ్యోతినగర్‌లోని ప్రైవేటు భవన్‌లో తిరుపతి జిల్లా జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గతంలో జిమ్నాస్టిక్ క్రీడాకారులు జాతీయ స్థాయిలో పతకాలు సాధించారని, ఇదే స్థాయిలో పతకాలు సాధించేందుకు ప్రణాళిక రూపొందించాలని, కోచ్‌ను నియమించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్యాట్రన్ ఎలమంచిలి ప్రవీణ్, అధ్యక్షుడు వైఎస్. బాబు, ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ.శివప్రసాద్, కోశాధికారి జయశేఖర్, ఈశ్వర్ ప్రకాష్, సి.శ్రీరాములు, వీజీ.అరుణ్, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్, సీఈవో మురళి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు ఆరోగ్య భద్రతను పాటించాలి



ప్రెస్‌క్లబ్ మెడికల్ క్యాంపులో షుగర్ పరీక్షలు చేసుకుంటున్న ఎమ్మెల్యే భూమన, ఎంపీ గురుమూర్తి, మేయర్ డాక్టర్ శిరీష

- ఎమ్మెల్యే భూమున, ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష
- ప్రెస్‌క్లబ్‌లో ఉచిత వైద్య శిబిరం



డాక్టర్లు కృష్ణప్రశాంతి, హరినాథ్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ, మేయర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు

తిరుపతి కల్చరల్: జర్నలిస్టులు ఆరోగ్య భద్రతను పాటించాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు.తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం శ్రీసాయి హర్షిత చారిటబుల్ ట్రస్ట్, హర్షిత హాస్పిటల్ అధినేతలు డాక్టర్ కృష్ణప్రశాంతి, సీనియర్ కన్సల్టెంట్, టాప్రోస్కోపిక్, జనరల్ సర్జన్ డాకర్ హరినాథరెడ్డి ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే భూమన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చాలామంది అవగాహన లేక ఊబకాయంతో అనేక రోగాలను కొని తెచ్చుకుంటున్నారని తెలిపారు. గతంలో మధుమేహంతో ఎంతోమంది చనిపోయారని తెలిపారు. మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే జీవనశైలిలో మార్పు అనివార్యమన్నారు. డాక్టర్ కృష్ణప్రశాంతి జర్నలిస్టుల ఆరోగ్య సంక్షేమం కోసం మెడికల్ క్యాంపు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎంపీ డాక్టర్ గురుమూర్తి మాట్లాడుతూ కరోనా తర్వాత ప్రజల జీవన విధానాల్లో చాలా మార్పులు వచ్చాయన్నారు. సమాజ హితం కోసం అహర్నిశలు పాటు పడే జర్నలిస్టులు వారి ఆరోగ్యం పట్ల సరైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ ప్రజలు ఆహారపు అలవాట్లలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డాక్టర్ కృష్ణప్రశాంతి మాట్లాడుతూ చాలా మంది ఆధునిక వైద్యంపై అవగాహన లేకుండా ఉన్నారని తెలిపారు. కోవిడ్ సమయంలో వైద్యురాలిగా తన మాట రోగిపై ఎంతో ప్రభావితం చూపిందని, వారు ఆరోగ్యవంతులవడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. అనంతరం చేపట్టిన మెడికల్ క్యాంపులో సుమారు 180 మంది జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు చేశారు. షుగర్, బీపీ, ఈసీజీ, యూరిక్ యాసిడ్, హెచ్‌బీఏ-1సీ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఇన్సులిన్ పెన్స్ ఎలా వాడాలి, వాటి ఉపయోగాలు అనే అంశంపై అవగాహన కల్పించారు. శ్రీసాయి హర్షిత చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో సుమారు రూ.లక్షల విలువైన మందులను మెగా మెడికల్ క్యాంపు నిర్వహణకు సమకూర్చారు. అనంతరం ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, బాలచంద్ర మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ సభ్యుల ఆరోగ్యం కోసం ప్రతి మూడు నెలలకొకసారి మెగా మెడికల్ క్యాంపును నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వైద్యురాలు కృష్ణప్రశాంతి, హరినాథరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు, గైనకాలజిస్ట్ సునీత పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి



ఎంపీకి వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ, అగ్రిగోల్డ్ అండ్ ఏజెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు

తిరుపతి కల్చరల్: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి విజ్ఞప్తి చేశారు. ఆయన ఆదివారం అగ్రి గోల్డ్ బాధితులతో కలిసి తిరుపతి ఎంపీ డాక్టర్ ఎం.గురుమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరిస్తామని వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మూడేళ్లు గడుస్తున్నా బాధితులు అధికారుల చుట్టూ తిరుగున్నారే తప్ప సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. కొంతమందికి ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని చెప్పినా ఇప్పటి వరకు చేయలేదని పేర్కొన్నారు. అగ్రిగోల్డ్ అండ్ ఏజెన్సీ వెల్ఫేర్ అసోసియేషన జిల్లా అధ్యక్షుడు బెల్లం కొండ శ్రీనివాస్ మాట్లాడుతూ బాధితులు అగ్రిగోల్డ్ ఏజెంట్లను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ నేత విశ్వనాథ్, జయచంద్ర, కోదండరామిరెడ్డి, ఈశ్వరయ్య, లక్ష్మీనారాయణ, గంగయ్య, నాగజ్యోతి, సుశీల, జమున పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్ మేలు మరిచిపోలేం

తిరుపతి మంగళం : విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ భవన నిర్మాణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించిన ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి మేలు మరిచిపోలేమని ఆ సంఘం నాయకులు తెలిపారు. వారు ఆదివారం ఎమ్మెల్యేను పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తమకు చెందిన స్థలాన్ని కొందరు కబ్జా చేయాలని ప్రయత్నించారని తెలిపారు. ఆ స్థలంలో భవన నిర్మాణం చేపట్టకుండా అనేక ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డికి విన్నవించినట్టు చెప్పారు. వెంటనే వారు స్పందించి సమస్యలను తొలగించి భవన నిర్మాణానికి సహకరించారని తెలిపారు. కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, అసోసియేషన్ నాయకులు ఎంఆర్ రెడ్డి, కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించండి



మాట్లాడుతున్న కె.రాధాక్రిష్ణ

తిరుపతి కల్చరల్: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాక్రిష్ణ పిలుపునిచ్చారు. గంధమనేని శివయ్య భవన్‌లో ఆదివారం తిరుపతి వాటర్ ప్లాంట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రథమ మహాసభ నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వాటర్ ప్లాంట్స్ నిర్వాహకుల సమస్యలు తెలుసుకున్నారు. వాటర్ ప్లాంట్ల నిర్వహణ వ్యయం పెరిగిపోతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. ఈ సమస్యలన్నింటినీ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని రాధాక్రిష్ణ తెలిపారు. అసోసియేషన్ కన్వీనర్ బాలాజీ మాట్లాడుతూ రోజు రోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్ ధరలు, ప్లాంట్ల మెయింటెన్స్‌ను దృష్టిలో ఉంచుకుని జనవరి 1 నుంచి వాటర్ క్యాన్ రూ.15లు చేశామన్నారు. అర్థం చేసుకుని సహకరించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు సీహెచ్.శివకుమార్, అసోసియేషన్ నాయకులు రాజు, ఎం.మోహన్‌బాబు, చందు, రఘు, రామాంజనేయులు, రాయల్, కిషోర్, ఉదయ్‌కుమార్, శోభన్‌బాబు, భాస్కర్‌రెడ్డి, ఆర్. రమణ, హెచ్.శారద, సురేష్ పాల్గొన్నారు.

ఉద్యోగ సాధనలో..



పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్ష రాసి వస్తున్న అభ్యర్థులు

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఆదివారం నిర్వహించిన పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షలకు అభ్యర్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పోలీసులు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించారు. తిరుపతి పద్మావతి, ఎస్వీ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాలవద్ద సందడి నెలకొంది.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు



తనిఖీ చేస్తున్న పోలీసులు



ఎస్వీ ఆర్ట్స్ కాలేజ్ వద్ద అభ్యర్థుల సందడి



రైల్వే గేట్ దాటుతున్న అభ్యర్థులు